



ఎలుకల బోనులో పడ్డ ఎలుకల్ని ఒకటొకటిగా జాగ్రత్తగా వదులుతున్నది రాజమ్మ. వాటిని కర్రతో కొట్టి కొట్టి చంపుతున్నాడు కేశవరావు- ఒక్కో ఎలుక చచ్చినప్పుడల్లా "చావ్వే చావు. ఎలా బలిసిందో పందికొక్కులా" అని.

ఇదేమీ పట్టించుకోకుండా వంటింట్లో టిఫిన్ ఏర్పాట్లు చకచక చేస్తున్నది మైథిలి.

తల్లీ కొడుకులు స్నానం చేసి వచ్చాక మైథిలి ఇద్దరికీ వేడి వేడి టిఫిన్ అమర్చింది సిద్ధంగా. ప్లేట్లలో పెట్టి నెయ్యి, కారప్పొడి వేసింది ప్రక్కనే చిన్న గిన్నెలలో సాంబారు పెట్టింది.

అరడజను ఇడ్లీలు తిన్నాక "ఈ సాంబారేమిటి ఇలా తగలడింది. ఉప్పు కషాయం" విసుక్కున్నాడు కేశవరావు.

"అమ్మపోతల్లి వంట నేర్పించి తగలేస్తేగా? గాడిదల్లే పెంచి మన మీదకు తోలారు" నోరు నంగు చేసుకొని అంది రాజమ్మ.

మైథిలి అదేం పట్టించుకోకుండా ఏదో పనిలో పడింది.

"ఇదుగోనేవ్! మర్చిపోయాను అడగడం. నిన్ను ఉత్తరం వ్రాయమన్నాగా మీ వాళ్ళకి డబ్బు పంపమని! జవాబు వ్రాశారా?" కేశవరావ్ అడిగాడు.

"ఆ! రాశారు" నిర్లిప్తంగా అంది మైథిలి.

"మరి చెప్పవేం? ఏం రాశారు?" తల్లీ కొడుకు లిద్దరూ తినటం ఆపి మైథిలి కేసి చూశారు.

"ఆ! ఏముంది చెప్పేందుకు? ఇప్పుడు డబ్బు పంపలేమని వ్రాశారు."

వెంటనే కేశవరావు ముఖం జేవురించింది. "పెళ్ళిలో ఇచ్చిన కట్నం డబ్బు, లాంఛనాల డబ్బు ఏం చేశారని కూడా రాశారు" అని అంది మైథిలి.

"ఆ! అంత ధైర్యమా!" రాజమ్మ గాడెత్తున లేచింది. "వీళ్ళిచ్చిన ముష్టి కట్నం ఎంతట! అదెప్పుడో పెళ్ళి ఖర్చులకే అయిపోయింది. కట్నం డబ్బుట, కట్నం డబ్బు!"

"అమ్మా! నీవూరుకోవే! దీన్ని ఫుట్‌బాల్ తన్ని నట్లు తంతే అదే వస్తుంది—డబ్బుతో సహా తిరుగు టపాలో" గాండ్రిస్తూ అన్నాడు కేశవరావు.

"అంతే కాదండీ...స్కూటర్ కని పదిహేను వేలు ఇచ్చాం! మొదటి పండగ అని ఐదువేలిచ్చాం... అవన్నీ ఏం చేశారు? ఇప్పుడు మళ్ళీ డబ్బు కావాలంటే ఎలాగ? అని నిముక్కుంటూ రాశారు" ఇంకా ఉడికిస్తూ అంది మైథిలి.

"ఇస్తే ఇచ్చార్లే! అల్లుడికి ఆమాత్రం ఇవ్వటం గొప్పా! ఏ బోడి ముఖం చూసి చేసుకున్నామా! ఏదో ఇంత పెట్టగలవాళ్ళులే అనుకున్నాంగాని ఇంత దరిద్రులనుకోలేదు. ఇంకొళ్ళయితే ఈపాటికి ఇంత కిరసనాయిల్ పల్లి నిప్పు పెట్టేద్దురు మీ నాయన రాసిన రాతలకు" ఆక్రోశంగా అంది రాజమ్మ.

"మా నాన్నొట్టి పిసినారి ముఖం అత్తయ్యా! మా అన్నయ్య అంతకంటేను. మా నాన్న ఇన్నాళ్ళయినా పిడుకల పడనీయడు. వాడొక్కడే పుట్టినట్లు ఆస్తంతా! మా అమ్మే ఒక్క రవ్వనయం! పెళ్ళికని ఎలాంటి పట్టు చీరలు తెచ్చారో చూశారు గదా! ఒట్టినాసిరకంవి."

"నిజమేనేవ్! ఒట్టి మొండి ముండాకొడుకులు. పదివేలిమ్మంటే ఛస్తున్నారు."

"నీవుండమ్మా! ఎలా ఇవ్వరో నేను చూస్తాను. ఒసే నువ్వు బట్టలు సర్దుకోవే! ఇచ్చేవరకూ రానవద్దన్నారని చెప్పు. అప్పుడు నాడ తల్లో తేజమ్మ ఇస్తుంది" కేశవరావు బుసకొడుతూ అన్నాడు.

"అలాగే లెండి! కానీ మా నాన్న జగమొండి మనిషి. నేను చెబితే వినిపించుకోరు. ఆ చెప్పేదేదో ఉత్తరంలో రాసివ్వండి బాబు! నేను తెల్సి చూపిస్తాను."

"ఆ రాస్తాను. సహాగానికంటేలా రాస్తాను. అప్పటిగ్గాని బుద్ధి రాదు వెధవలకి!" మైథిలి ముక్తసరిగా టిఫిన్ కానిచ్చి పెట్టెలో తన వస్తువులన్నీ సర్దుకుంది.

* * *

"ఇదేం అవాంతరమండీ! గుండె పగిలేలా ఎలా రాశారో చూడండి! ఒట్టి డబ్బు మనుషుల్లా వున్నారే! పిల్లను సరాసరి పంపించేశారు" మొత్తుకుంది జానకమ్మ.

"పెళ్ళిలో నుండీ వాళ్ళను చూస్తూనే వున్నాంగా! ఇప్పుడు కొత్త ఏముంది?" దిగులుగా అన్నాడు మైథిలి తండ్రి.

"ఛస్తే ఇవ్వొద్దు నాన్నా! ఏం చేస్తాడో చూద్దాం! దబ్బిస్తేగాని రావొద్దంటాడా! ఇప్పుడే ఫోన్ చేసి నాలుగూ దులిపేస్తాను"- మైథిలి అన్నయ్య భాస్కర్ ఎగిరిపడ్డాడు.

"ఒరే కాస్త నోరు సంబాళించుకోరా! ఇవతల మన పిల్ల సంగతి ఆలోచించు. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది అన్నట్లు నోరు జారితే దాని బతుకు బజార్న పడుతుంది" జానకమ్మ కొడుకును మందలించింది.

"ఏమిటమ్మా! పెళ్ళయి ఆర్నెల్లు. ఇచ్చిన డబ్బంతా ఏం చేశారు? మనం ఇలా ఇస్తూ వుంటే వాళ్ళు దాన్ని తన్ని పంపిస్తూనే వుంటారు. డబ్బుకాసే చెట్టనుకున్నాడా దాన్ని విదిలిస్తే డబ్బు రాలడానికి."

"ఏం చేస్తాంరా నాయనా! తెలియక బురదలో కాలేశాం. మన ప్రారబ్ధం. అనుభవించక తప్పదు. పోనీ నా చంద్రహారం అమ్మండి. పిల్లకన్నా నగ ఎక్కువా?"

"అది ఆదికాదమ్మా! ఇప్పటి కెలాగో తెస్తానను కో! తరువాత మళ్ళీ నేధిస్తే?"

"ఎలా జరగాలనుంటే అలా జరుగుతుందిలే

నాయినా! ఇప్పటికి పని కానివ్వు. ఎల్లకాలం ఒకలాగే వుండదుగదా! ఓర్చుకున్న వాళ్ళకు చెడువు లేదు. ఆపైన భగవంతుడున్నాడు" అనునయంగా చెప్పింది తల్లి.

మైథిలి వాళ్ళది కాస్త కలిగిన కుటుంబమే అయినా మైథిలి పెళ్ళి మూలంగా డబ్బు ఖర్చుకావడం మూలంగా ఆ డబ్బు తేవడం కాస్త కష్టమే అయింది.

వాళ్ళు డబ్బు కోసం తంటాలు పడుతుంటే మైథిలికి చీమకుట్టినట్లుగా కూడా లేదు. చక్కటి చీరలు కట్టుకుని హుషారుగా ఎక్కడెక్కడికో వెళ్ళి వస్తున్నది.

నాలుగు రోజుల్లో పది వేలు జమ చేసి మైథిలికిచ్చాడు తండ్రి.

మైథిలి ఆ డబ్బు తండ్రికే ఇస్తూ "నాన్నా! ఈ డబ్బూ, నా బంగారం కూడా అమ్మి నా పేరున బ్యాంకిలో వేయండి నాన్నా" అన్నది.

"అదేంటమ్మా! అల్లుడు గారికి..."

"నేను అక్కడికి వెళ్ళడం లేదు నాన్నా! అతను వ్రాసిన కాగితం ఆధారంగా విడాకులకు నోటీసు ఇచ్చాను. ఏదో నా చదువుకు తగ్గ చిన్న ఉద్యోగం చూసుకున్నాను. కాస్త ఆదాయం వస్తుంది, నా ఖర్చులకు సరిపోతుంది నాన్నా!"

"అయ్యో! అయ్యో! ఇదేం కొత్త ఉపద్రవమే! ఈమాత్రం దానికి విడాకులిస్తానంటావా! నలుగురూ ఏమంటారు?" అంతా వింటున్న తల్లి లబలబ లాడింది.

"ఏమంటారమ్మా! ఎవరేమన్నా అంటే అతను వ్రాసిన కాయితం చూపించు. అప్పుడు వాళ్ళకే గడ్డి పెడతారు. అందరూ పిల్లా పాపా వున్నవాళ్ళే కదా!"

తండ్రి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. "నలుగురి సంగతి అలావుంచు తల్లీ, నీకు డబ్బు గురించి బెంగ కూడా అక్కర్లేదు. నా ఆస్తిలో భాగం పెడతాను. వాణ్ణి ముప్పతిప్పలు పెట్టి తీసుకున్నదంతా కక్కిస్తాను. కాని నీ జీవితంలో సుఖం సంతోషం ఏముంటాయి? అది ఆలోచించుకో" అన్నాడు.

"నాన్నా! నేను అక్కడికి వెళ్తే జీవితంలో సుఖం సంతోషం సంగతి అలా వుంచు, జీవితమే పోగొట్టుకోవాల్సి వస్తుంది నాన్నా! ఎంతో తేలిగ్గా ప్రాణాలు తియ్యగల దుర్మార్గులు వాళ్ళు. అది తెలిసి ఎలా వుండగలను నాన్నా! అందుకే డబ్బివ్వమని మీరుత్తరం వ్రాసినట్లు కల్పించి చెప్పి తెలివిగా నాకు కావల్సినట్లుగా ఉత్తరం వ్రాయించుకుని వచ్చేశాను. నన్ను వెళ్ళమని బలవంతం చెయ్యవద్దు నాన్నా!" మైథిలి స్థిరంగా అంది.

"ఎంత నిబ్బరంగా చెబుతున్నావే తల్లీ! పెళ్ళంటే నూరేళ్ళ పంట! పుచ్చింకాయ అనుకున్నావా ఏరి పారెయ్యడానికి" సగం విస్మయంగా, సగం బాధగా అంది తల్లి.

"కాదమ్మా! నేను ఈ నిర్ణయం ఒక్క నిమిషంలో తీసుకోలేదు. ఆర్నెల్లు నరక యాతన పడి తీసుకున్న నిర్ణయం. బురదలో అడుగేస్తే కాలు ఇవతలకి తీసుకొని కడుక్కోవాలమ్మా! అంతేకాని ఆ బురదలో కూరుకుపోనక్కరలేదు. మీ తరం వేరు మా తరం వేరు" శాంతంగా అంది మైథిలి.

"ఏం తరమో ఏమో! సంసారం, పిల్లలు లేకుండా మోడల్లే ఎంతకాలం వుంటావు? జీవితమంతా అడవి గాచిన వెన్నెలేగదా!" కళ్ళ నీళ్ళు పెట్టుకుంది తల్లి.


"ఎందుకనుకోవాలమ్మా! చూద్దాం! కాలం నా జీవితంలో ఏం మార్పులు తెస్తుందో! నువ్వేగా అంటావ్ ఎల్లకాలం ఒక రీతిగా వుండదు అని..." చిగురించే ఆశతో చిరునవ్వు నవ్వింది మైథిలి. కూతురికేసి చూస్తూ ఆమె మరేం మాట్లాడలేకపోయింది.

## ఆటోగ్రాఫ్-ఫోటోగ్రాఫ్




కాళోజి పూర్తి పేరు కాళోజి నారాయణరావు. కాళోజి కవిగా వేమన వంటివాడు. వేమన ఎంత నిష్ఠుర సత్యాలను ఎంత నిశితంగా చెప్పాడో కాళోజి కూడా అలాగే చెప్పారు. నిజాం వ్యతిరేక ఉద్యమం నుంచి ఏడు పదులు దాటిన ఇప్పుడు కూడా అన్ని ప్రజా ఉద్యమాలనూ బలపరుస్తున్నారు. ఆయన 'నా గొడవ' ప్రజల గొడవే.

సేకరణ: పి.మల్లేశ్వరరావు
సన్నాఫ్. రామచంద్రరావు, రథం గుడి దగ్గర, మండపేట-533 308.



## నీరు




ఎడిసన్ ఒక పెద్ద గదిలో కూర్చుని రకరకాల ప్రయోగాలు చేస్తూ వుండేవాడు. ఆయన గదికి ఓ పెద్ద తలుపు వుంది. ఆ తలుపు చాలా బరువుగా వుండేది. ఒక రోజు ఓ స్నేహితుడు ఎడిసన్‌ను అడిగాడు-

"మిత్రమా! నీ గది తలుపు అంత బరువుగా వుంటుందేమిటి?"

అందుకు ఎడిసన్ చిరునవ్వు నవ్వారు. "నా కోసం ప్రతీ రోజూ షుమారు యాభై మంది అభిమానులుగానీ, స్నేహితులు గానీ వస్తూ వుంటారు. వచ్చిన ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కసారి నా గది తలుపును బలంగా తోస్తారు-లోపలకు రావడం కోసం. వాళ్ళు బరువుగా వున్న తలుపుపై బలాన్ని వుపయోగించడంతో తడవతడవకు ఒక గ్యాలన్ నీరు
నా ఓవర్ హెడ్ టాంక్‌లోకి వచ్చి పడుతుంది. నేనా తలుపుకు అటువంటి ఏర్పాటు చేశాను. అదీ సంగతి" అన్నారు ఎడిసన్. అతని తెలివికి మిత్రుడు ఆశ్చర్యపోయాడు.

సేకరణ: కొడిమెల శ్రీరామమూర్తి



## సినిమాస్కోప్ ఫోటో సీరియల్

కథ, ఫోటోప్లే, డైరెక్షన్:
బి.ఎం.ఈశ్వర్
రచనా సహకారం:
బి.సుజాత
ఫోటోలు:
చైతన్య మున్షి



